# వరుడు కావలెను

—ఎనుగంటి వేణుగోపాల్



నెలకు అయిదువేలు ఆదాయంగల అందమైన ప్రభుత్వ ఉద్యోగిని(24)కి—స్థిరాస్థి/ఉద్యోగం/వ్యాపారం ఉండి మంచి వర్చస్సు, చక్కని రూపం గల అందమైన సుఫురద్రూపివరుడు కావలెను.

★ ★ ★

మధురిమ అనాథ యువతి, అనాథాశ్రయంలో పెరిగి, ఆత్మవిశ్వాసంతో ఎదిగి, తపస్సులా పి.జి. చదివి... జీవిత భీమా సంస్థలో టైపిస్టుగా జాయినయ్యింది.

మధురిమ మధురంగా ఉంటుంది, మనోహరంగా నవ్వుతుంది. మత్తెక్కించే ఆమె కళ్ళు, మైమరపించే ఆమె ఒళ్ళు, పొద్దు తిరుగుడు పూవుల్లాంటి ఎద, కుర్రకారుని గిలిగింతలకి గురి చేసినా—యువకుల్ని కలవరింతలకి లోను చేసినా —ఎవరి ప్రలోభపు గాలాలకీ చిక్కలేదా మనోహరి.

కానీ తన అందచందాలు చూసి మగవాళ్ళంతా చిత్తవుతుంటే మాత్రం గర్వంగా ఫీలయ్యేది. తనకి తగ్గ జతగాడు, ఈ రతీదేవి పక్కన నిలువదగ్గ నవ మన్మథుడు, తన రూపలావణ్యానికితోడైన సుందరుడు ఎక్కడున్నాడోనని కలలుకనేది.

ఓ దినపత్రికలో ప్రచురింపబడిన ప్రకటనకి స్పందించిన వరుల దగ్గరనుండి పది రోజుల్లోనే అసంఖ్యాకమైన ఉత్తరాలనందుకొన్న మధురిమ వాటిని ముందేసుక్కూచుంది.

ఆ ఉత్తరాల దొంతరల నుండి చిరునవ్వులు చిందిస్తూ తనవైపే కొంటే చూపులు చూస్తున్నట్టున్న ఓ అందమైన యువకుడి ఫోటో ఆమె చేతుల్లోకి చేరి... మనసులో దూరి... ఆమెని వివశురాలిని చేసింది. యమస్మార్ట్‌గా ఉన్నాడతను. పేరు కూడా చాలా బాగా నచ్చిందామెకు, వైవిధ్యంగా ఉందతడిపేరు... స్నేహిత్, పైగా మునిసిపాలిటీ కన్సల్టింగ్ కాంట్రాక్టర్.

అతడితోపాటుగా మరో నలుగురి ఫోటోలని సెలెక్ట్ చేసుకొని పెళ్ళి చూపుల్లాంటి ఇంటర్వ్యూల కొరకై వారిని ఆహ్వానిస్తూ విడివిడిగా ఉత్తరాలు రాసింది .

★ ★ ★

అయిదుగురిలోనూ ఆమెకు స్నేహిత్ బాగా నచ్చాడు.

పైగా అతనూ తనలాగే అనాథగా పెరిగి కష్టపడి పైకొచ్చినవాడు. తన మనసుని అర్థం చేసుకోగలడన్న నమ్మకం ఆమెది. ఏడేడు జన్మలదాకా తనకి తోడుగా ఉంటాడన్న విశ్వాసంతో అతనితో ఓ శుభోదయాన ఏడడుగులు నడిచిందామె.

అలా ఏరికోరి స్నేహిత్‌తో మధురిమ బ్రహ్మముడి వేయించుకుంది.

★ ★ ★

మధురిమ కన్రెప్పలు మూసి, సోఫాకి జేరగిలబడి తల వెనక్కి వాల్చేసిందల్లా—"నిద్ర పట్టేసిందా?" అన్న పిలుపుకి ఉలిక్కిపడి కళ్ళు తెరిచింది. కనుపాపలు బెదిరాయ్.

"అరరె! ఆఫీసు పనుల్తో అలసిపోయి ఉంటావు. ఎందుకు లేవడం? పడుకో...పడుకో...! జస్ట్—ఊరికే ఆలోచిస్తూ కళ్ళు మూసుకున్నావా లేక కళ్ళు మూసుకుని ఆలోచిస్తున్నావా అని అడిగానంతే!" పక్కనే కూచుంటూ అన్నాడు స్నేహిత్.

ఏం మాటాడితే ఏమంటాడోననే సంశయంతో మౌనంగా ఉండిపోయిందామె. సడన్‌గా ఏదో గుర్తొచ్చిన దానిలా అస్తవ్యస్తమైన చీరని సవరించుకుంటూ గబుక్కున పైట సర్దుకుందామె.

అందుక్కారణం—

ఓ రోజు స్నేహిత్ ఇంటికి రావడం బాగా లేటయింది. భర్త కొరకు ఎదురుచూస్తూ బెడ్ మీద వెల్లకిలా పడుకొని అన్యమనసుగా

బుక్‌ని తిరగేస్తోందామె.

స్నేహిత్ వస్తూనే పుస్తకం చదువుతున్న మధురిమ దగ్గరికి చప్పుడు కాకుండా వెళ్ళి, చెదిరిన ఆమె పైటని గుండెలపై సర్దుతుంటే ఒక్కసారిగా తుళ్ళిపడి లేచిందామె.

"అరె... నిజంగానే భయపడ్డావా? లేక భయపడ్డట్టు ఆక్ట్ చేశావా? మరే ఎవరో పరాయి మగాడు వచ్చాడనుకున్నావా? అయినా నేను తప్ప ఎవరొస్తారిక్కడికి... ఈ వేళ! అవునా?? ఒకవేళ నాకు తెలియకుండానే ఎ...వ...రై...నా వ...స్తు...న్నా...రా...?" చూపుల్లోని శాడిజాన్నంతా చేతిలోకి మార్చేసి, ఆమె బుగ్గమీద అదోలా నిమురుతూ ఒత్తొత్తి పలికాడా చివరిపదాన్ని.

చివుక్కుమందామె గుండె. చివ్వున తలెత్తింది. కోపంతో భర్త చేతిని విసిరికొట్టింది. ఒళ్ళంతా పాకిన అసహ్యం ఆమె కళ్ళల్లోకి ప్రవహిస్తున్నా పట్టించుకునే స్థితిలో లేడతను.

"ఏం... కోపమొచ్చిందా మొనాలిసా! ఇంత రాత్రివేళ తలుపులకి గడియైనా పెట్టుకోకుండా అలా ఆదమరచి, మైమరచి పైట చెదిరినా పట్టించుకోకుండా సెక్సీగా పడుకున్నావె? అది పుస్తక పఠనం అనాలా లేక ఎవరితోనైనా ఫాంటసీలోకి వెళ్ళడం అనాలా!" ముఖంలోకి క్రౌర్యాన్ని ఒంపుకుంటూ వ్యంగ్యంగా అన్నాడు.

భర్త ప్రతి మాటకీ ఒళ్ళంతా కుతకుతమంటుంటే చీర సర్దుకోవడానికి లేవబోయింది మధురిమ.

"అరరే, డిస్టర్బ్ చేశానా డియర్! అయినా పడుకున్న దానివి లేవడమెందుకని? లేవమని నేననలేదే? పడుకో!పడుకో! ఏనాడైనా భర్త ఇంటికి రావడం కాస్త ఆలస్యమైతే భార్య ఊహాలోకంలో విహరించే మాడరన్ యువకుడు. ఏం చేద్దాం??" అన్నాడు పెదవి విరుస్తూ.

మధురిమ చేతిని పట్టుకొని బెడ్‌వైపు లాగాడు. బ్యాలెన్స్ తప్పి వెళ్ళి అతడిపైన పడిందామె. ఆ పడడం ఎదభాగం అతడి మొహానికి తగిలింది. భర్త ఉచ్ఛ్వాస నిచ్ఛ్వాసల్లోంచి ఘాటైన వాసన ఆమె నాసికా పుటాల్ని తాకింది. అప్పుడుగాని తెలిసిరాలేదామెకి భర్త ఫుల్‌గా తాగొచ్చాడని.

ఉక్రోషాన్ని అదిమిపట్టి, లేచి "వడ్డించమంటారా?" అనడిగింది.

"పార్టీలో తినొచ్చాను" ముద్ద ముద్దగా ఉన్నాయతని మాటలు.

"మరి నే భోం చేయనా?" అడిగింది.

"అరరే! ఇంతవరకూ నీవు భోంచేయనే లేదా? భర్త అనే నా కోసం భార్య అనే నీవు వెయిటింగా? శబ్బాష్! హైక్లాస్ మెలోడ్రామా. వండర్‌ఫుల్ సెంటిమెంటల్ టచింగ్. బావుంది...బావుంది..." అంటూ వెకిలిగా నవ్వాడు.

కాస్తాగి మళ్ళీ తానే—

"ఇదో టైపు భాగోతం. ఆఫీసు పేరిట తిరిగే తిరుగుళ్ళు మామూలే! చేసే పనులు గప్‌చుప్‌గా చేసేయడమే! పైగా ఏవీ ఎరగనట్లు మొగుడి ముందే సాధ్వీమణి గెటప్స్! సతీ సుబ్బమ్మ బ్రాండ్..." ఒళ్ళు తూలుతుంటే, మాటలు తడబడుతుంటే, అనాల్సినవి పూర్తిగా అనకుండానే బెడ్‌పై వాలిపోయారు.

పెళ్ళంటే నూరేళ్ళ పంట కాదని ప్రతిక్షణం నరకమని, భర్తంటే భాగస్వామ్యం కాదని బాధాస్వామ్యమనే వాస్తవం నెమ్మదిగా తెలిసొచ్చిందామెకు.

ఆ రోజంతా కుళ్ళి కుళ్ళి ఏడ్చింది. అప్పటి నుండి భర్త ముందు మాటిమాటికీ పైట సర్దుకునే అలవాటు మొదలయ్యింది. అలాగే మరో



కొత్త అలవాటూ అలవర్చుకుంది. భర్త మానసికంగా హింసించినప్పుడల్లా అలుపుతీరేదాకా ఆలోచించడం, మౌనంగా మథనపడడం, నిశ్శబ్దంగా రోదించడం!

"అరరే! అలా బొమ్మలా బిగుసుకు పోయావేటి? డిస్టర్బ్ చేశానా... సో సారీ!" అనడంతో ఈ లోకంలోకి వచ్చిపడింది మధురిమ.

కోపాన్ని పెదాల అంచునే అదిమి, మనసుని సర్దుకుంటూ నెమ్మదిగా అడిగింది "కాఫీ కలపమంటారా?" అని.

"ఆఁ... కలుపు ఇద్దరికీ!"

హమ్మయ్యా! అనుకుంటూ హాల్లోంచి రివ్వుమని ఎగిరి వంట గదిలోకి వచ్చిపడింది.

★ ★ ★

మొగుడి చొక్కా పట్టుకొని గుంజుతూ, ఆ గది ప్రతిధ్వనించేలా అరిచాననుకుంది మధురిమ. కానీ జరగలేదలా! మిన్ను విరిగి మీద పడి, మన్ను కరిగి తనువు కూరుకుపోతూ, గుండె సమాధి అవుతుంటే... నిలువునా ఊగిపోయింది.

"ఏ...మ...డు...గు...తు...న్నా...డు...వా...డు?? అణువణువూ కంపించసాగింది.

మరోసారి భర్త మాటలు మధురిమ చెవుల్లో మార్మోగాయి.

"మీ ఆఫీసు స్టాఫ్‌తో కులుకగా లేంది. మునిసిపల్ చైర్మన్‌గారితో ఒక్కరోజు ఒకే ఒక్కరోజు గడిపితే ఏం పోయింది? ఒకటా... రెండా యాభైకోట్ల కాంట్రాక్ట్ నాకే దక్కుతుంది. ఎంత లేదన్నా మన వాటాకి అయిదుకోట్ల పై చిలుకు దక్కుతాయ్! ఈ అవకాశం మళ్ళీరాదు. నీ శీలానికీ, పాతివ్రత్యానికేం ఢోకా లేదు. భర్తను నేను చెబుతున్నాగా!" తాపీగా అనేసి సిగరెట్‌ని కాలుస్తూ ఆమె సమాధానం కోసం కాచుకూర్చున్నాడు.

వేధించే వాడితో వాదించదలచుకోలేదామె. మౌనంగా ఉండిపోయింది. పుణ్యం కొద్దీ పురుషుడంటారు. మరి తను... తనేం పాపం చేసిందని? గొంతు మూగవోయి, వదనం పాలిపోయి, గుండె గూడు పేలిపోగా అచేతనంగా కూలబడి పోయింది.

క్షణాలు ముక్కలై పోతున్నాయి. ఇద్దరి మధ్యా చాలాసేపు నిశ్శబ్దం...

"అనాథవి, అనాఘ్రత పుష్పంగానే ఇన్నాళ్ళు ఉన్నావంటే నమ్మడానికి నేనేమైనా వెర్రి వాడిననుకున్నావా లేక పెళ్ళికి ముందు ఏ మగాడి స్పర్శ తగలలేదంటే విని ఊర్కోవడానికి చెవిలో పువ్వుగాని పెట్టుకొన్నాననుకున్నావా? మౌనంగా ఉంటే, మాటాడకుండా ఉండిపోతే ఊరకుంటాననుకున్నావా? లేక ఏడిస్తే మనసు మార్చుకుంటాననుకున్నావా? అదేం కుదరదు.

నీ అంగీకారంతో నాకు సంబంధం లేదు. నీవు చైర్మన్‌తో ఓ రాత్రి గడపాల్సిందే... తప్పదు గాక తప్పదు... అది ఏ రోజనేది మాత్రం తర్వాత డిసైడ్ చేసి చెబుతాను బై!" అంటూ ఆజ్ఞ జారిచేసి, సిగరెట్ పీక కిందపడేసి కాలితో నులిమేసి విసవిసా బయటకెళ్ళిపోయాడు.

అగ్ని సాక్ష్యం అబద్ధమై...
నాతిచరామి అసంబద్ధమై...
తాళిబొట్టు ముద్దలై...
వివాహబంధమే బ్రద్దలై...

నూతనాధ్యాయానికి సరికొత్త పుటల్ని సమీకరిస్తూ విడాకులకి సిద్ధమవుతున్న వేళ—

ఆమె కనుకొనల నుండి జాలువారిన అశ్రుకణాలు అలసిన సైనికుల్లా నేలకొరగసాగాయి.

అదే క్షణంలో...

మధురిమ మనసు పొరల్లో ఓ స్థిర నిర్ణయం ఊపిరి పోసుకుంది.

★ ★ ★

"వివాహమైన మూడు మాసాలకే విడిపోయి, విడాకులు పొందిన అందమైన అణుకువ గల ప్రభుత్వోద్యోగినికి మంచి మనసే ఆస్తిగా—చక్కని నడవడికే ఉద్యోగంగా—గొప్ప సంస్కారమే చదువుగా గల వరుడు కావలెను". అన్న ప్రకటన పత్రికల్లో వచ్చింది

●